# ముష్టి + నీ ఎమ్.ఎస్. వెరసి నీ ఖరీదెంత?

ఆలూరి విజయలక్ష్మి

నర్సింగ్ హోమ్ ముందు హంస లాంటి కారొకటి సంపన్నుడి అతిథియులా వచ్చి ఆగింది. కారులో నుంచి ఒంటినిండా ఖాళీ లేకుండా నగలు దిగేసుకున్న ఒక లావుపాటావిడ, ఆవిడ వెనక బంగారు తీగలా అతి నాజూకుగా, ఎంతో అమాయకంగా ఉన్న ఓ పద్దెనిమిదేళ్ళ అమ్మాయి దిగారు. లావుపాటావిడ ఠీవి గానూ, బంగారు తీగ భయం భయం గానూ డాక్టర్‌గారి పేరునీ, డిగ్రీని పరిశీలించి డాక్టర్ గారి కన్సల్టేషన్ రూమ్ వైపు దారి తీశారు. నర్స్ ఎదురొచ్చి ఎంతో వినయంగా, ఆప్యాయంగా ఆహ్వానించి వెయిటింగ్ రూమ్‌లో కూర్చోబెట్టింది.

"డాక్టరమ్మ ఉందా?" దర్పంగా నర్స్ వంక చూసింది లావుపాటావిడ.

"ఉన్నారండి. లోపల పేషెంట్స్‌ని చూస్తున్నారు" అంది నర్స్, ఓ. పి. చిట్ వ్రాస్తూ.

"ముందు మమ్మల్ని చూసి పంపమను." నర్స్ అందించిన చీటీని నిర్లక్ష్యంగా అందుకుంది ఆవిడ.

"అరుగో, చూడండి. మీ ముందింకా ఆరుగు రున్నారు. వారిని చూడగానే కాంపౌండర్ మిమ్మల్ని పిలుస్తాడు." సౌమ్యంగా చెప్పి మరో పేషెంట్ దగ్గరకు వెళ్ళింది నర్స్.

తనను పిలిచేవరకు అసహనంగా అటూ ఇటూ కదులుతూ కూర్చుందావిడ.

"మా అమ్మాయిని పరీక్ష చెయ్యాలండి" అంది డాక్టర్‌గారి రూమ్‌లో అడుగు పెడుతూనే.

"కూర్చోండమ్మా! ఇలా రా, అమ్మా, నువ్వు." ఎదురుగా ఉన్న కుర్చీని ఆవిడకు చూపించి, ఆ అమ్మాయి వైపు తిరిగింది డాక్టర్ కృష్ణవేణి.

"ఏమిటమ్మా బాధ?" ఆప్యాయంగా ఆ అమ్మాయి వైపు చూసింది కృష్ణవేణి.

అమ్మాయి బెదురు బెదురుగా తల్లి వంక, డాక్టర్ వంక మార్చి మార్చి చూస్తూంది. పెదాలదురుతున్నాయి. విలక్షణమైన కాంతితో, ముగ్ధత్వంతో నిండిన కళ్ళలో మెల్ల మెల్లగా నీళ్ళూరుతున్నాయి. ఆమెలో ఉన్న న్యూనతా భావాన్ని ఖరీదైన బట్టలు, నగలు దాచలేకపోతున్నాయి.

"అలా వ్రేలిముఖమేసుకుని చూస్తే ఏమిటో? చెప్పు." ఆవిడ విసురులో ఉన్న క్రౌర్యాన్ని గుర్తించింది కృష్ణవేణి. ఆమెలో ఉన్న అహంకారం కూతురి మీది మమతను చంపేసింది.

"మీరుండండి, నేను కనుక్కుంటాను. ఇలా రా, అమ్మా, నువ్వు." ఆ అమ్మాయి భుజం మీద చెయ్యేసి పరీక్ష చేసే గదిలోకి తీసుకు వెళ్ళింది కృష్ణవేణి.

"నర్స్! ఫాన్, లైట్ వేసి, తలుపు వేసేసి బయటకు వెళ్ళు." డాక్టర్ చూపించిన స్టూల్ మీద కూర్చుంటూ మెల్లగా కళ్ళెత్తి ప్రశాంతంగా ఉన్న డాక్టర్ ముఖాన్ని, వింత వాసనల్ని వెదజల్లుతున్న రూమ్‌ని కలయ చూసిందా అమ్మాయి.

"నీ పేరేమిటమ్మా?"

"సుజాత."

"చదువుకుంటున్నావా, అమ్మా?"

"బి. ఏ. పాసయానండి."

"ఎమ్. ఏ. కు వెళ్ళలేదేం?"

"బి. ఏ. వరకు చదవడమే కష్టమైపోయిందండి. ఊళ్ళో కాలేజీ ఉంది కాబట్టి ఇంతవరకైనా చదివించారు. మా ఇళ్ళలో ఆడపిల్లలని బయటికి పంపి చదివించడమే!" కళ్ళు విప్పార్చి, గుండె మీద చెయ్యేసుకుంది సుజాత.

తెల్లగా, సుకుమారంగా ఉన్న ఆమె చేతి వంక చూస్తూ చిన్నగా నవ్వింది కృష్ణవేణి. "ఏం? యూనివర్సిటీకి పంపితే ఆడపిల్లలు పాడయిపోతారనా?"

అవునన్నట్లుగా తల ఊపింది సుజాత.

"అవును. మన వెధవ సమాజంలో ఆడదానికో న్యాయం, మగవాడికో న్యాయం. మగ పిల్లలు చదువు నెపంతో ఎంత అప్రాచ్యపు పనులు చేస్తున్నా వాళ్ళను నెత్తిమీద పెట్టుకుని పూజిస్తారు. ఆడపిల్లలెంత ఒబ్బిడిగా ప్రవర్తించినా, ఎంత సమర్థులయినా వాళ్ళని గురించి ఈసడిస్తూ మాట్లాడతారు. యూనివర్సిటీకి పంపితే ఆడపిల్లలేనా పాడయేది, మగ పిల్లలు పాడవరు కాబోలు!" ఆవేశం కదిలింది డాక్టర్ స్వరంలో. అంతవరకు సుజాత ముఖంలో ఉన్న కాస్త కూస్త కళ కూడా హరించిపోయింది.

"మగవాడు చేసిన తప్పు పొగలా క్షణంలో రూపుమాసిపోతే; ఆడపిల్ల చేసిన తప్పు నిప్పులా కాల్చి వాత పెడుతుంది, డాక్టర్!" జలజలా మంచి ముత్యాలు సుజాత చెక్కిళ్ళ మీద పాలమీగడ మీద దొర్లినట్లు దొర్లాయి.

"సుజాతా! ఇటు చూడమ్మా!" మునివేళ్ళతో ఆమె గడ్డాన్నెత్తి కలవరంగా చూసిందామె వైపు.

"నీ బాధేమిటో చెప్పు. శారీరకమైనదా? మానసికమైనదా? నేను చెయ్యగల సహాయం తప్పకుండా చేస్తానమ్మా!" అందమైన ఆమె ముఖం వైపు జాలిగా చూసింది కృష్ణవేణి. ప్రపంచంలోని కల్మషమేమిటో ఎరగనట్లున్న ఈ శ్రీమంతురాలి బాధేమిటో అంతుపట్టలేదామెకు.

"డాక్టర్! నాకు బ్రతకాలని లేదు. ఐ వాన్ట్ టు డై!" వలవలా ఏడ్చింది సుజాత.

"తప్పమ్మా! అలాంటి పాడు ఆలోచన రానివ్వకూడదు నువ్వు. చావును కోరేంతగా నిన్ను బాధపెడుతున్న సమస్య ఏమిటి? మన పరిచయమయి కొన్ని నిమిషాలే అయినా, నీ కన్నీళ్ళు చూస్తుంటే నా మనసాగడం లేదు. చెప్పమ్మా, నీ బాధేమిటి? చూడు. ఏడవకలా." సుజాత చెక్కిళ్ళ మీద కన్నీటిని తుడిచింది కృష్ణవేణి.

"డాక్టర్! నా కథ విని నన్ను అసహ్యించుకోరు కదూ?" బెదురుగా డాక్టర్ వంక చూసింది సుజాత.

"నో, నో. మనిషి బలహీనతల్ని అర్థం చేసుకోగలను నేను." జాలిగా సుజాత వంక చూసింది కృష్ణవేణి.

"డాక్టర్! మా కుటుంబ ఆచారాల ప్రకారం పెద్దమనిషయిన ఆడపిల్లల్ని బయటి ముఖం చూడనీయరు. మా నాన్నగారికి నేనంటే ఉన్న గారాబంవల్ల నేను కాలేజీకి వెళ్ళే అవకాశం కలిగింది. సరిగ్గా క్లాసుకు కాలేజీలో నన్ను విడిచే కారు కాలేజీ క్లాసయేసరికి నాకోసం సిద్ధంగా ఉండేది. కాలేజీలో మరీ అవసరమయితే తప్ప, అదీ ఆడపిల్లలయితే తప్ప ఎవరితోనూ మాట్లాడద్దని ఆజ్ఞ జారీ చేశారు మా వాళ్ళు. నాకుమాత్రం నాతోటి ఆడపిల్లల్లా రకరకాలుగా ముస్తాబు చేసుకుని నలుగురితోటి సరదాగా నవ్వుతూ, తుళ్ళుతూ, కబుర్లు చెబుతూ నడిచి కాలేజీకి రావాలని, అబ్బాయిలు కామెంట్స్ విసురుతూంటే దొంగ కోపం నటించి వాళ్ళకి పెంకి జవాబు చెప్పాలనీ, గడుసు ప్రశ్నలతో లెక్చరర్‌ని ఏడిపించాలనీ ... ఎన్నో కోరికలుండేవి. కానీ, మా ఇంటి ఆచారాలు నా కాళ్ళకు సంకెళ్ళయేవి; నా నోటికి తాళం వేసేవి. స్వేచ్ఛకోసం అలమటిస్తున్న నా మనసుని మా కాలేజీ స్పోర్ట్స్ ఛాంపియన్ శ్యాంబాబు దొంగిలించాడు. అతనితో నా స్నేహం మా వాళ్ళకు తెలిసేటప్పటికి మా మధ్య చనువు బాగా పెరిగింది. నా మీద కట్టడి ఎక్కువయే కొలది నాలో ఓ విధమైన తెగింపు, నా మంచితనం మీద, మనో నిబ్బరం మీద నమ్మకం లేని వాళ్ళ మీద ఓ విధమైన కసి బయలుదేరాయి. ఫలితం ... ఓ అల్పక్షణంలో కాలు జారాను. వయసులో ఉన్న ఆడపిల్లల్ని బయటికి పంపితే చెడిపోతారన్న మా వాళ్ళ నమ్మకాన్ని నిజం చేశాను." ఒక్కసారి భోరుమంది సుజాత.

"ఏడవకు, సుజాతా! ఆడపిల్లలు బయటకు రావడం వల్ల ఎప్పుడూ చెడిపోరు. మనిషి చెడిపోవడానికి కారణం వాళ్ళ మనః ప్రవృత్తులు, వాళ్ళ చుట్టూ ఉన్న పరిస్థితులు. ఏదో ఒక వ్యాపకంతో




బయట తిరిగే వాళ్ళకన్నా సోమరితనంగా గోళ్ళు గిల్లుకుంటూ ఇంట్లో కూర్చునే వాళ్ళకే చెడిపోవడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది." చదువుకున్న ఆడపిల్లల్నీ, ఉద్యోగం చేస్తున్న ఆడపిల్లల్నీ తక్కువగా చూసే వాళ్ళంటే విసుగు కృష్ణవేణికి.

"అలా అంటే మన పెద్దవాళ్ళొప్పుకోరు, డాక్టర్!" ఓ క్షణం ఆగింది సంజాత.

"ఇప్పుడు మా అమ్మ నన్నిక్కడికి ఎందుకు తీసుకొచ్చిందో తెలుసా, డాక్టర్? నా ప్రేమ పెళ్ళి, మా అమ్మ దృష్టిలో నా పాపం ఫలాన్ని తీసేయించ దానికి." నవ్వు కోల్పోయినట్లుగా ఉంది దాని ముఖం.

"ఏదేమిటమ్మా! శ్యాంబాబుని పెళ్ళి చేసుకోవన్న గదా నువ్వు? మావాళ్ళొప్పుకోవడం లేదా?" ఆత్రంగా అడిగింది కృష్ణవేణి.

"ఒప్పుకోకపోవడం కాదు, డాక్టర్! అతన్ని నా పిలుపు అందనంత దూరానికి మా వాళ్ళు తరిమి వేసింది." శూన్యంలోకి చె చూస్తోంది సంజాత. ఆ అమ్మాయి మాటల్లో ఉన్న విషాదానికి కదిలిపోయింది కృష్ణవేణి.

"డాక్టర్! నా ప్రేమ ఫలాన్ని క్షేమంగా లోకంలోకి తీసుకువచ్చి

పెంచగలిగే శక్తి లేదు. కాని, ఎంతో అపురూపంగా చూసుకోవలసిన నా శిశువును తీసేయించుకోవడమనే ఊహే నన్ను పిచ్చిదాన్ని చేస్తూంది, డాక్టర్! దయచేసి నాకీ సహాయం చేయండి. నేను చావడానికి కూడా వీల్లేకుండా కట్టడిచేశారు మా వాళ్ళు. చావడానికేదో ఒక మందివ్వండి, డాక్టర్!" కుమిలి కుమిలి ఏడుస్తూంది సుజాత.

"తప్పమ్మా! అలా మాట్లాడకూడదు. నూరేళ్ళ బ్రతుకు నీ ముందుంది. తెలిసో, తెలియకో చేసిన ఒక తప్పుకి నీ నిండు జీవితం బలి అవకూడదు. శీలం విలువైనదే. కాని, జీవితం ఇంకా విలువైనదమ్మా! శీలం జీవితంలో ఒక భాగం మాత్రమే. ఒక్కసారి శీలాన్ని కోల్పోయినంత మాత్రాన జీవితంలో ఎంతో ఔన్నత్యాన్ని సాధించడానికవకాశమున్న నువ్వు, నీ బ్రతుకు నాశనం చేసుకోకూడదు. నువ్వు చేసింది తప్పని నువ్వు నమ్మితే, అది మరల జరగకుండా చూచుకోవడమే నీ కర్తవ్యం. తప్పు ఏదో ఒక రూపంలో చెయ్యకపోతే మనం మనుషులం కాదు, సుజాతా! కాని ... ఇది సహజమైనదని నమ్మి ఆ తప్పుని క్షమించే ఔదార్యం మనుషుల్లో వచ్చిన రోజున నీలాంటి ఆడపిల్లలు ఆత్మహత్యకు దారితీయరు." ఏడుపు ఉధృతానికి ఊగుతున్న సుజాత భుజాలమీద అనునయంగా చేతులు వేసింది కృష్ణవేణి.

"కాని, గతాన్ని మరిచిపోవడమెలా? ఎంతో పవిత్రురాలిలా నలుగురిలో తిరగడమెలా?" వెక్కిళ్ళ మధ్య తనను తాను ప్రశ్నించుకున్నట్లుగా అంది సుజాత.

"లోకంలో నీలాంటి వాళ్ళు చాలా మంది ఉన్నారు. వినగా వినగా నువ్వు తప్పటడుగు వెయ్యడానికి కారణం నీ చదువే నో: భావం నీలో కూడా పాతుకుపోయినట్లుంది. నాలుగు గోడల మధ్య అసూర్యంపశ్యలలా పెరిగిన సో-కాల్డ్ కన్నెపిల్లలెందరో నా దగ్గరకు గర్భ విచ్ఛేదానికి వచ్చారు. రహస్యంగా కడుపు తీసేయించుకున్న ఆ అమ్మాయిలు మరో ఆరేడు నెలల్లో పెళ్ళిళ్ళు చేసుకుని భర్తల్ని వెంటబెట్టుకుని లోకంలోని వెలుగు నంతటిని ముఖాలకు పులుముకుని, మళ్ళీ గర్భవతు లయామని ట్రీట్‌మెంట్‌కు వస్తూ ఉంటారు. ఒక బలహీన క్షణంలో ఈ అమ్మాయి లెంతకైనా తగుదు రనిపించినా, వాళ్ళోని సంస్కారం వాళ్ళ ధైర్యాన్ని, బ్రతుకుతో రాజీపడే నిబ్బరాన్ని మెచ్చుకుంటుంది." డాక్టర్ మాటలు వింటూ కొంతవరకు దుఃఖాన్ని మరిచింది సుజాత.

"కమాన్, సుజాతా! బి బ్రేవ్! పిచ్చి ఆలోచన లేవీ చెయ్యద్దు. నీ బ్రతుకును అందంగా మలచుకో. నీ ఈ శిశువు గురించి బాధపడకు. మళ్ళీ ఈ రోజుల్లో పురుడుపోసి నీ అందాన్ని పుణికిపుచ్చుకున్న పండంటి బాబు నందిస్తాను." సుజాత నుత్సాహపరచడానికి ఉల్లాసంగా మాట్లాడడం మొదలుపెట్టింది కృష్ణవేణి.

• • •

డిస్చార్జి అయిన పేషెంట్స్‌కి మందులు రాసి ఇచ్చి అలసటగా కుర్చీలో వాలింది డాక్టర్ కృష్ణవేణి. ఒక్కసారి ఒంటరితనం భయంకరంగా ముందు నిలిచినట్లయింది. పొంగుతున్న చైతన్యంలా గడిచిపోయిన విద్యార్థి జీవితం గుర్తుకు వచ్చింది. హౌస్‌సర్జన్సీ చేస్తున్నప్పటి చిలిపి ఊహాల్ని, ఒక్కసారి థ్రిల్‌తో గుండెను ఝల్లుమనిపించే సంఘటనలు, రామూతో పరిచయం, తనూ, అతనూ నైట్ డ్యూటీలో కేస్ షీట్స్ వ్రాస్తూ, ఎమర్జెన్సీస్‌కి అటెండ్ అవుతూ కలబోసుకున్న అందమైన ఊహలు, తాము వివాహం చేసుకోవాలని నిశ్చయించుకోవడం, తన ఆశయాల కనుగుణంగా ఈ టౌన్‌లో నర్సింగ్ హోమ్ పెట్టడం, రామూ ఎమ్. ఎస్. చదవడానికి వైజాగ్ వెళ్ళిపోవడం ... అన్నీ ఒక్కసారి కళ్ళ ముందు కదిలాయి. రామూ స్మృతితో కృష్ణవేణి హృదయమూ, శరీరమూ కూడా స్పందించాయి. అప్రయత్నంగా డాక్టర్ రామారావు వ్రాసిన లెటర్ని చేతిలోకి తీసుకుంది కృష్ణవేణి.

"డియర్ వేణూ!

నేను రేపు అక్కడకు వస్తున్నాను. నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి. పరీక్షలు దగ్గరవుతూ ఉండడం వల్ల తీరిక లేక నీకు తరుచు లెటర్స్ వ్రాయడం లేదీ మధ్య. మిగతా విషయాలు రేపు మాట్లాడుకుందాం.

—రామూ."

ఎంతో పొడిపొడిగా ఉన్న ఆ లెటర్ని చూసి అసంతృప్తితో మూలిగింది కృష్ణవేణి హృదయం. వయసులో ఉన్న అబ్బాయి ఈ కాబోయే భార్య కిలాగేనా లెటర్ వ్రాయడం? రామూ వచ్చాక చెవులు మెలేసి మరీ చెప్పాలి, ఎంత మధురంగా లెటర్ వ్రాయాలో. తనని ఏడిపించాలనిలా వ్రాసి ఉంటాడీ పిచ్చి రామూ. అయినా, పరీక్షలు సెప్టెంబర్లో ఉంచుకుని ఇప్పుడేం మునిగిపోయిందని వస్తున్నాడో? ఏమిటబ్బా తనతో మాట్లాడవలసిన ముఖ్యమైన విషయం! బహుశా, వెంటనే పెళ్ళిచేసుకుందా మనడు కదా? ఎమోషనల్ ఫూల్. పెళ్ళి చేసేసుకుని తనకూడా ప్రాక్టీసులో సెటిలయిపోతానని ఎంత రాద్ధాంతం చేశాడు! రోజు రోజుకు కాంపిటేషన్ పెరిగిపోతూంది ప్రొఫెషన్‌లో. పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని, పెళ్ళయాక వేరుగా ఉండడం కష్టమవుతుందని నచ్చచెప్పేటప్పటికి ఎంత కష్టమయింది! ఇంకెంత? రెండు నెలలు కళ్ళు మూసుకుంటే రామూ శాశ్వతంగా తన ముందుంటాడు. నర్సింగ్ హోమ్ బాధ్యత నంతటినీ అతనికి అప్పగించి, సాధ్యమైనంత ఎక్కువకాలం ఇంట్లో ఉండి అతని పనులు... తరవాత ... తరవాత ... పుట్టే బుల్లి బుల్లి పాపాయిల పనులు చూచుకుంటుంది. తను డెలివరీ కేసులకు మాత్రం అటెండయితే సరిపోతుంది. సంవత్సరాని కోసారి రామూ, తనూ అలా జాలీజాలీగా ఏ హంపీ శిథిలాల్ని చూడడానికో, జోగ్, బృందావన్ లాంటి ప్రదేశాల్లో ప్రకృతితో కలిసి ఆనందించడానికో వెళతారు. అన్నట్లు రామూ కిష్టమయిన గులాబ్‌జామ్ చెయ్యాలి. ఇంకెంత? రెండు మూడు గంటల్లో రామూ వచ్చేస్తాడు.

రాము కనిపించేవరకు మధురోహల పరవశిస్తూనే ఉంది డాక్టర్ కృష్ణవేణి. అతనికి టిఫిన్, కాఫీ ఇచ్చి విశ్రాంతి తీసుకోమని చెప్పి, హాస్పిటల్ పని పూర్తి చెయ్యడానికి వెళ్ళింది. పేషెంట్స్ నందరినీ త్వరత్వరగా చూసి పంపించేసి రామూ మంచానికి ఎదురుగా కుర్చీ లాక్కుని కూర్చుంది.


"రామూ!"

"ఊఁ." ఎక్కడో ఉన్నట్లుగా పలికి మెల్లగా కళ్ళు విప్పాడు. అతని కళ్ళు కృష్ణవేణి ముఖాన్ని పరిశీలనగా చూస్తున్నాయి. అతని కళ్ళ ముందు అరచేతి నటూ ఇటూ ఆడించి చిలిపిగా నవ్వింది కృష్ణవేణి.

"ఎక్కడున్నావు, బాబూ! రంభా, ఊర్వశి సమేతరగా తుంబుర గానాన్నాలకిస్తున్నావా? అప్సర కన్నెల రమణీయ నృత్య విలాసాన్ని తిలకిస్తున్నావా?" కుర్చీలో ముందుకు వంగి కూర్చుని కుతూహలంగా రామూ వంక చూచింది కృష్ణవేణి.

"డాక్టరమ్మగారికి కవిత్వం పుట్టుకొస్తూందేమిటి విశేషం?"

"పోవోయ్, బడాయి అంతా నీకు. ఇందులో విశేష మేముంది? శశాంకుని కరుణ కిరణ ప్రసారంతో కలువభామ పులకరించడంలోనూ, నీలమేఘ గర్జనను విని పురి విప్పి నాట్యం చేసే మయూరి హొయల్లోనూ విశేష మేముంది?" అందంగా సిగ్గుపడింది



ప్రశ్నించే ఆ కళ్ళల్లో ప్రేమ అనే పచ్చగా కనిపించి, పుట్టినరోజుకి ఒక్కసారిగా లోని ఆరాధనని చూసి ఒక్క క్షణం నివ్వెరపోయింది.

"వేణూ!" బాధగా మూలిగింది ఆమె హృదయం.

"ఏం, రామూ? ఎందుకలా దిగులుగా ఉన్నావు? బ్రాందీ తాగినట్టు మత్తుగా ఉందేం? ఏమైంది?" ఆత్రంగా అడిగింది కృష్ణవేణి.

"లేదు, వేణూ! నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి." టీని నిదానంగా తాగుతున్నాడు రామూ. అతని దిగులుని పసిగట్టలేనట్లుగా నవ్వుతున్న దర్జా చూసుకుంటున్న అతని మెడ పరిశీలించి చూసి ఆశ్చర్యంతో ఆగిపోయింది.

"అదేం, రామూ! ఎందుకలా అవుతున్నావు?" అతనిలో జరుగుతున్న సంఘర్షణ అంతా అతని కనిపిస్తోంది ఆమె కళ్ళకి.

"వచ్చే ఆయిదవ తేదీన నా మారేజ్, వేణూ!" వర్షాకాలంలో పిడుగుపాటులా వినిపించినట్లుగా వచ్చింది కృష్ణవేణి.

"వాట్! నీ మారేజ్ ఏమిటోయ్? మన మారేజ్ అను. అయినా, నాతో చెప్పకుండానే డేట్ కూడా నిశ్చయం చేశావు, ఎంత ధైర్యం నీకు!" కళ్ళు పెద్దవి చేసి బెదిరిస్తున్నట్లుగా చూసింది కృష్ణవేణి.

"నువ్వు సీరియస్‌గా తీసుకోవడం లేదు, వేణూ!"

"ఏం సీరియస్‌నెస్, మహానుభావా! తెల్లారకుండానే నాకు పరీక్షలు, బ్లాక్ ఔట్, నే పోతానని బెంగెట్టేస్తున్నావు. ను వ్వొస్తే ఈ కాసేపూ హాయిగా నవ్వకుండా, ఏ స్టడీ చేయాలని నువ్వు చేసే సిల్లీ జోక్స్‌ని సీరియస్‌గా తీసుకుని గుండె పగిలి చావమంటావా? నా వల్ల కాదు, బాబూ!" మురిపంగా కళ్ళు త్రిప్పి ఎంగ మూతి పెట్టింది కృష్ణవేణి.

"ఓ వేణూ! నువ్వెందుకు నన్నర్థం చేసుకోవు?" బాధగా తల పట్టుకుని కూర్చున్నాడు రామూ.

"డోంట్ బి సిల్లీ, రామూ! మరో రెండు నెలల్లో నువ్వొచ్చి నర్సింగ్ హోమ్ బాధ్యతనంతా తీసుకుంటావనీ, నేను నిశ్చింతగా ఇల్లాలుగా, నీ పిల్లల తల్లిగా నీ సుఖాల భాగస్వామిని కావాలని కోరుకుంటున్నాను. నా ఈ ఆనందమైన కల క్షణ మాత్రమే అయినా, చెరిగిపోవడం భరించలేకపోతున్నాను. పరిహాసానికి కూడా నువ్వలా మాట్లాడద్దు. ప్లీజ్!" ప్రేమతో జ్వలిస్తున్న అతని కళ్ళ వంక చూడలేక ముఖం పక్కకి త్రిప్పుకొన్నాడు రామూ.

"నాకు పెళ్ళి అయిపోయింది, వేణూ! నా బాధను గ్రహిస్తావని నీకు చెప్తున్నాను. పెళ్ళి మాట నా తల్లి చేసిన నిర్ణయం, నా భార్య సేవకి వచ్చినప్పటికీ హాయిగా నిర్ణయించాం. నా చెలియలికి, నా పిల్లలు పెరిగి పెద్దవాళ్ళు కావాలని తమ తల్లి ప్రేమతో పెరగాలని నా కోరికా. నా భార్య రోజుల్లో కష్టపడి సంపాదించి అహంకారంతోనో, అభిమానంతోనో అస్తమానూ చిటపటలాడటం సహించలేను." ఎవరో కొత్త వ్యక్తిని చూస్తున్నట్లు అతని వైపు చూస్తూ కూర్చుంది కృష్ణవేణి.

"మరి ...? ! మరి ...? !" మాటలు రానట్లుగా తడబడింది కృష్ణవేణి.

"మరి ఇన్నాళ్ళు నిన్ను పెళ్ళాడతానని ఎలా అన్నాననా నీ సందేహం? ఈ మూడేళ్ళ నుండి నీ సంపాదన మీద ఎలా బ్రతికానా అని అనుమానపడుతున్నావు కదూ? సారీ, వేణూ! అసలు నాకు మొదటి నుండీ డాక్టర్ని పెళ్ళాడడం ఇష్టం లేదు. నేను అడిగినదానికి మించి డబ్బు పంపి ఈ మూడేళ్ళు డబ్బు సమస్య లేకుండా నేను నిశ్చింతగా చదువుకునేందుకు సహాయపడ్డావు. అందుకు నే నెంతో కృతజ్ఞుడిని." అప్పటికి కృష్ణవేణి అతను తనను ఫూల్ చెయ్యడానికి మాట్లాడడం లేదని, ఎంతో సీరియస్‌గా మాట్లాడుతున్నాడని పూర్తిగా నమ్మింది.

"రామూ! నే నంటే నీకు కృతజ్ఞత తప్ప, అంతకుమించిన అనుబంధం ఇంకేమీ లేదా? ! ఇటు చూడు. నా వైపు చూచి చెప్పు, రామూ?" రెక్కలు తెగి పడిన పక్షి ఆర్తనాదంలా ఉం దామె స్వరం.

"వెరీ సారీ, వేణూ! అనవసరంగా నిన్ను చేసుకుంటానని నమ్మించినందుకు సిగ్గుపడుతున్నాను." తలవంచుకుని చేతి గోళ్ళ వంక చూసుకుంటున్నాడతను.

"సిగ్గుపడవలసింది నువ్వు కాదు, బాబూ, నేను సిగ్గుపడాలి. మీ మగ జాతి పరువు తీయడానికే నీకు పుట్టిన పిల్లల్ని చూసి సిగ్గుపడతాను. నీ కంటే ఏమీ కాని కొన్ని సిగ్గుపడిన చూపులు పెట్టుకుని అందరికీ హాయిగా చెప్పుకో. నీ భార్య అదృష్టం వెలిగిపోయింది." రోషంగా అతని వంక చూస్తూ లేచి నిలుచుంది కృష్ణవేణి.

"ఆవేశపడకు, వేణూ! కొంచెం ప్రాక్టికల్‌గా ఆలోచించు. నా కోరికం కను గుణంగా నువ్వు పోలేవు. నీ సంపాదన చూసి ఆకర్షితురాలై నిన్ను చేసుకోవడానికి ముందుకొచ్చే వాళ్ళు చాలా మంది ఉంటారు. ఎలాగూ డాక్టర్స్‌కి డిమాండ్ లేదుగా? భార్య డాక్టరయితే ప్రాక్టీస్ బాగుంటుందనే ఆలోచనతోనన్నా ఎవరో ఒక డాక్టర్ నిన్ను పెళ్ళాడతాడు."

అతని వంక నివ్వెరపోయి చూసింది కృష్ణవేణి. "బహుశా ఈ ఆలోచనతోనే నువ్వు నాకు దగ్గరయి ఉంటావు కదూ? నీ దురాలోచన, నీ మోసం ఇప్పు డర్థమవుతున్నాయి నాకు. నేను భార్యనయితే నువ్వు నా నీడ మాత్రంగా మిగులుతావనీ, డాక్టర్ రామారావు మరుగున పడిపోయి డాక్టర్ కృష్ణవేణి భర్తగా పలుగురి నోళ్ళలో నానతానని భయం పట్టుకుంది నీకు, కదూ? ! " సూటిగా అతనివంక చూస్తూ అడిగింది కృష్ణవేణి.

"గుడ్ హెవెన్స్! ఎంతలా మాటలు విసురుతున్నావు, వేణూ! అందుకే మా ఫ్రెండ్స్ డాక్టర్ని పెళ్ళాడద్దురా, బాబూ అని వాదిస్తారు."

అతనంటే ఓ విధమైన అసహ్యం కలిగింది కృష్ణవేణికి. "నువ్వూ, నీ ఫ్రెండ్స్ ఈ రోజుల్లో పుట్టవలసిన వాళ్ళు కాదు. మీకు జన్మసిద్ధమైన సంస్కారమూ లేదు; చదువు నేర్పిన విజ్ఞానమూ లేదు. చదువుతో పువ్వుల్లా వికసించవలసిన మీ హృదయాలు అజ్ఞానంతో కుళ్ళిపోతున్నాయి. మీ తెలివి గ్రహించలేకపోయాను." పరిహాసంగా అంది కృష్ణవేణి.

రామూ ముఖం కోపంతో ఎర్రబడింది.

"అవును. మేము మానవులమే కృష్ణవేణి. మీరు స్త్రీలు ఎంతటి తప్పు చేసినా మాట్లాడకుండా ఉన్నాం. ఏళ్ళ నుండి చూస్తున్నాను. అంటే మీ లేడీ డాక్టర్లలో ఎంత మందికి సవ్యమైన నడత ఉంది?" ఎగతాళిగా కృష్ణవేణి వంక చూశాడు డాక్టర్ రామూ.

"రామూ! ఏమిటంటున్నావు? చివరికి... చివరికి ... నా నడతని కూడా నువ్వు అనుమానిస్తున్నావా? చెప్పు, రామూ!" ఆవేశంగా అతని చెయ్యి పట్టుకొని ఊపింది.

మౌనంగా తన వంక చూస్తున్న అతని కళ్ళల్లోని కాఠిన్యాన్ని చూస్తుంటే ఇలాంటివాడినా నేను ప్రేమించింది! అని క్రుంగిపోయింది కృష్ణవేణి.

"ఏది సంవత్సరాలుగా ఇంత మంది లేడీ డాక్టర్స్‌ని, కడుపు తీసేయించుకోడానికి వచ్చే కన్నెపిల్లల్నీ చూస్తూ కూడా ప్రత్యేకంగా లేడీ డాక్టర్స్ మీద ఇంత అభాండం వెయ్యడానికి సిగ్గుపడాలి, రామూ, నువ్వు. అవున్లే. ఇంతగా తెలిసిన నన్నే అవడానికి వెనుదియ్యనివాడివి, నీ వెంతకైనా తగుదువు. అయినా, నాకు తెలిక అడుగుతున్నాను. మీ మగ డాక్టర్లందరూ పవిత్రులే నంటావా? లేక మీ రెంత దౌర్భాగ్యులయినా మీ పాదాలు కడిగి నెత్తిన పోసుకోవా లంటావా మేము? !" ఎగతాళిగా చూసింది కృష్ణవేణి.

"మాకేం? మగ మహారాజులం మేము..."

"స్టాపిట్!" మధ్యలోనే అతన్ని ఆపేసింది కృష్ణవేణి.

"కేవలం మగ పుట్టుక పుట్టినందుకే నువ్వు గర్వపడుతున్నావంటే, అందుకు సిగ్గుపడాలి నువ్వు. మనం గర్వపడవలసింది మన సంస్కారాన్ని చూసుకుని, మనం చేస్తున్న మంచి పనుల్ని చూసుకుని. నువ్వు మగవాడుగా పుట్టినంత మాత్రాన నువ్వు చేసిన తప్పు ఒప్పు అవదు. 'మేం మగవాళ్ళం, మేము ఏం చేసినా చెల్లుతుంది'అనే అహంకారం నుంచి మీ మగవాళ్ళెంత త్వరగా బయటపడితే అంత మంచిది."

అతని వంక ఏహ్యంగా చూసింది కృష్ణవేణి. తను చేస్తున్న పనికి మాత్రం బాధపడకుండా నిశ్చలంగా కూర్చున్న రామారావును చూసి దిగ్భ్రాంతురాలయింది కృష్ణవేణి.

కెమిస్ట్రీ

రెండు హృదయాలు ప్రేమతో కలుసుకున్నప్పుడు అవి రెండూ రసాయనిక మార్పులు చెంది, తమ సహజ స్వభావాన్ని కోల్పోయి 'సుఖం' అనే కొత్త పరిణామం చెందుతాయి.

—మూర్

"తెలిసి తెలిసి నీలాంటి వాళ్ళకు చేరువయే నా లాంటి ఆడపిల్లలకీ శిక్ష పడవలసిందే, రామూ! ఇంత స్వార్థానికి దిగజారిపోయిన నీతో ఇంక మాట్లాడాలని లేదు. ఇంతటితో మన మధ్యనైనా బంధమనేది ఉంటే అది తెగిపోయింది. జీవితంలో మరిచిపోలేని పాఠాన్ని నేర్పావు. దయచేసి సాధ్యమైనంత త్వరగా ఇక్కడి నుండి వెళ్ళిపో. అంతఃపురంలో పువ్వులా సుకుమారంగా పెరిగిన పతివ్రత నెవరినైనా పెళ్ళిచేసుకుని సుఖపడు. నీ పెళ్ళికి నన్ను పిలవడం మరిచిపోకు. నీ పతివ్రతను చూసి ఆనందిస్తాను." కన్నీళ్ళు ఇంకిపోయి శూన్యంగా ఉన్న కళ్ళతో, రేగిన తలతో, కోపంతో ఎరుపెక్కిన ముఖంతో భయం గొలిపేలా ఉంది కృష్ణవేణి రూపం. ఆమెకు జవాబు చెప్పకుండా పాంట్ వేసుకుని, లుంగీ మడత పెడుతున్నాడు డాక్టర్ రామారావు. వళ్ళ బిగువున కన్నీళ్ళు నాపుకుంటూంది కృష్ణవేణి.

"వెల్, డాక్టర్ రామారావ్! నువ్వు ప్లస్ నీ ఎమ్. ఎస్.-వెరసి నీ ఖరీదెంత?" హేళనగా నవ్వుతూ అడిగింది కృష్ణవేణి.

"నాలుగు లక్షలు." పళ్ళు గిట్టకరుచుకుంటూ అన్నాడు డాక్టర్ రామారావు.

"క్వైట్ ఎ లక్కీ బిజినెస్. నీ కొస్తున్న దాని ముందు నేను సంపాదించేదెంత? ! నీ కింత ఖరీదుందని నాకు తెలియదే? !" విరసనగా చూసింది కృష్ణవేణి.

"రియల్లీ ఐయామ్ లక్కీ! ఇంత అందమైన మంచి అమ్మాయి నాలుగు లక్షలతో నా భార్య అవడం నా అదృష్టం." అతిశయంగా తల ఎగరేశాడతను.

"అందమైన మంచి అమ్మాయేనా? లేక మగపురుగు ముఖం కూడా చూడని మహా పతివ్రత కూడానా?" పగలబడి నవ్వింది కృష్ణవేణి.

"ఆఫ్‌కోర్స్. అన్నామాత స్వప్నం."

అతని అహంకారాన్ని చూసి ఉడికిపోతూంది కృష్ణవేణి.

"స్నేహంగా నీ నుండి విడిపోదామని వచ్చాను. నా స్వంత పేషెంట్‌గా తీసుకుంటూ నమ్మకో లేదు. డబ్బు అందగానే నీకు పంపిస్తాను." షూట్ కేస్ చేత పట్టుకున్నాడతను.

"గో టు హెల్ విత్ యువర్ డర్టీ మనీ! మళ్ళీ నాకెప్పుడూ కూడా కనపడద్దు."

"ఐయామ్ సారీ, మేడమ్!"

"నేను డాక్టర్ కృష్ణవేణిని. మేడమ్ కాదు, డాక్టర్ రామారావ్, బిహేవ్ యువర్ సెల్ఫ్!" అతను వెళ్ళిపోతూంటే ఒక్కొక్క అడుగు తన హృదయం మీద వేస్తూ వెళ్ళినట్లు బాధపడింది. అతను చూపు కందినంత మేర నిర్లిప్తంగా చూస్తూ నిలబడి అతను కనుమరుగవగానే ఒక్కసారి బావురుమంది కృష్ణవేణి. 'భగవాన్! నాకు తెలిసినంతలో ఇతరులకి ఉపకారమే చేశానే, నా కెందుకింత శిక్ష?' వలవలా కన్నీరు కార్చింది కృష్ణవేణి.



వెలుగునీడలు ఫోటో—ఎస్. వై. జేంద్ర (కొల్హాపూర్)

• • •

"ఓ! సుజాతా! ఏమిటమ్మా ఇలా వచ్చావు?" చదువుతున్న మెడికల్ జర్నల్ పక్కన పడేసి సుజాతను ఆహ్వానించింది డాక్టర్ కృష్ణవేణి. డాక్టర్ రామారావు ఇచ్చిన షాక్ నుండి తేరుకోలేదింకా కృష్ణవేణి. ముఖమంతా చాలా పేలవంగా, నిర్లిప్తంగా ఉంది. తల వంచుకుని వానిటీ బాగ్ మీద చూపుడు వేలితో రాస్తూంది సుజాత.

"ఆరోగ్యం బాగుందా, సుజాతా? కాంప్లికేషన్స్ లేవుగా ఆపరేషనయాక?" ఆదరంగా సుజాత వంక చూసింది కృష్ణవేణి.

"నా బ్రతుకే కాంప్లికేషన్స్ మయమయిపోయింది, డాక్టర్‌గారూ!" కన్నీళ్ళు చిందాయి సుజాత చెక్కిళ్ళ మీద.

"అదిగో, అలా మాట్లాడవద్దనే నేను చెప్పేది. ఊహా, అలా మాట్లాడావంటే నే నీతో మాట్లాడనే మాట్లాడను."

డాక్టర్‌గారి వాత్సల్యాన్ని చూసి కరిగిపోయింది సుజాత.

"నా బ్రతుకు నో కొత్త మలుపుకి తిప్పుతున్నారు మీరు. జీవితం మీద నా కో విధమైన కోరికను కలిగిస్తున్నారు. మీరు నా కందిస్తున్న ఆప్యాయతకు బదు లివ్వలేను." ఆర్ద్రతతో కదిలిపోతూ కృష్ణవేణి వంక చూసింది సుజాత.

"నా కో బుజ్జి బాబును కనివ్వు. వాడిని పెంచుకుంటూ నువ్వు బదులు తీర్చేశా ననుకుంటాను." నవ్వింది కృష్ణవేణి. వాడిపోయిన సుజాత ముఖంలో అనూహ్యమైన నవ్వు మెరిసింది.

"బుజ్జిబాబుల్ని కనడానికి రేపు నాకు లైసెన్సిస్తారు డాక్టర్! అలా చూస్తారేం? రేపు రాత్రికి నా పెళ్ళి. ఇంత త్వరలో నాకు వరు డెక్కడ దొరికాడా అని ఆశ్చర్యపోతున్నారా? ఈ రోజుల్లో డబ్బుకు సాధ్యం కాని దేమీ లేదు. నిమిషాల మీద నాకు వరుణ్ణి కొని తెచ్చారు మా నాన్నగారు." కృత్రిమమైన గాంభీర్యం సడలిపోయి అంతలోనే సుజాత కంఠం రుద్ధమయింది.

"కాని ... నా గతాన్నంతా అతన్నించి దాచి ఎలా బ్రతకగలను? నన్నెంతో పవిత్రంగా ఊహించుకుని నన్ను స్వీకరించే అతన్నెలా మోసపుచ్చేది? చెప్పండి డాక్టర్!" ఒకవైపు కర్చీఫ్‌తో కన్నీళ్ళు తుడుచుకుంటూనే కన్నీళ్ళు కార్చింది సుజాత.

"మళ్ళీ మొదటి కొస్తున్నావు, సుజాతా! నువ్వు ఈ 'పవిత్రత' అన్న పదానికి అనవసరపు ప్రాధాన్య మిస్తున్నావు. నీ గతాన్ని అతన్నించి దాయకేం చేస్తావు? తను దక్షిణ నాయకుడైనప్పటికీ, తన భార్య పరాయి మగాణ్ణి చూస్తేనే పతిత అయిపోయిందని గింజుకుచచ్చే దౌర్భాగ్యులు మన మగవాళ్ళు. అందుచేత అతని సంస్కారాన్ని నమ్మి నీ గతా న్నతనికి చెప్పి క్షమాపణ కోరుకునే పొరపాటు ఏమాత్రం చెయ్యకు. పశ్చాత్తాపంలో నువ్వు చేసిన పొరపాటు దహించుకుపోయింది. నీలో ఉన్న నైర్మల్యంలో సగమున్నా నీ కాబోయే భర్తలో ఉంటే మహదృష్టవంతురాలివేనని గుర్తుంచుకో. కళ్ళు తుడుచుకో, సుజాతా! ఇంక నీ ముఖం మీద నవ్వు తప్పితే కన్నీళ్ళు చూడకూడదు నేను." దాదాపు ఆజ్ఞాపిస్తున్నట్లుగా అంది కృష్ణవేణి. మంత్రముగ్ధురాల్లా కృష్ణవేణి మాటలు వింటూ కూర్చున్న సుజాత కళ్ళు తుడుచుకుంది.

"నా పెళ్ళికి వచ్చి ఆశీర్వదించండి, డాక్టర్! రేపు రాత్రికి కారు పంపిస్తాను. తప్పక రండి." వానిటీ బాగ్‌లోనుండి శుభలేఖ తీసి డాక్టర్ చేతిలో పెట్టి సెలవు తీసుకుంది సుజాత. అనాసక్తంగా శుభలేఖను పక్కను పడేసి హృదయాన్ని కుమిలిస్తున్న ఆలోచనల్లోకి జారిపోయింది కృష్ణవేణి.

మరునాటి రాత్రి ముహూర్తధారణ సమయానికి సుజాత పంపిన కారులో నుండి దిగింది కృష్ణవేణి. ఆహూతుల మధ్య నుండి తల వంచుకుని కళ్యాణ మండపం వైపు నడుస్తున్న డాక్టర్ కృష్ణవేణి వధూవరుల వైపు చూసి బ్రమ్మపడి పోయింది.

సుజాత పక్కను మధుపర్కాలలో మెరిసిపోతున్నాడు డాక్టర్ రామారావు.